AKSHARA TODAY

అక్షర టుడే


TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

వెన్ను విరుస్తున్న స్పీడ్ బ్రేకర్లు



2



2

వృద్ధురాలి ఇంట్లో చోరీ..

ఎంఈడీ పరీక్షలు ప్రారంభం



అక్షరటుడే, తెయూ క్యాంపస్: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఎంఈడీ రెండో సెమిస్టర్ (రెగ్యులర్) పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాన్ని కంట్రోలర్ కే.సంపత్ కుమార్, అడిషనల్ కంట్రోలర్ టి.సంపత్ పరిశీలించారు. పరీక్షలకు 26 మంది విద్యార్థులకు 25 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు.



నీల కంఠేశ్వరాలయంలో హుండీ లెక్కింపు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్. విజయరామారావు పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. హుండీ ఆదాయం రూ.3,36,084 వచ్చిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీరామ్ రవీందర్, విష్ణు పారాయణ మహిళా బృందం, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.




బియ్యం సరఫరాలో జాప్యం జరగకుండా చూడాలి

అక్షరటుడే, కామారెడ్డి: ప్రభుత్వానికి అందించే బియ్యం సరఫరాలో జాప్యం జరగకుండా చూడాలని సివిల్ సప్లయ్ డైరెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ అన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో బియ్యం సరఫరాపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం నిల్వలు, సరఫరా ప్రక్రియను డైరెక్టర్ సమీక్షించారు. బియ్యం పంపిణీలో ఎలాంటి జాప్యం జరగకుండా, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా త్వరితగతిన బియ్యం సరఫరా చేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. బియ్యం సరఫరాలో నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, డీఎం శ్రీకాంత్, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



బెటాలియన్‌లో ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

అక్షరటుడే, డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం అలివేలు మంగ సమేత లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నిత్య పూజలు, బలిహరణం యాగం, వాహన సేవ, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ సత్యనారాయణ దంపతులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నవనీత్ దంపతులు ఆలయ కమిటీ ప్రతినిధులు, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.



శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ వెలవెలబోతోంది. గతేడాది ఇదే సమయానికి నిండుగా నీటితో కళకళలాడిన జలాశయంలో ప్రస్తుతం సగం కూడా నీళ్లు లేవు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టుల నుంచి తాగునీటికే ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం చెబుతుండటంతో యాసంగి సాగు ఎలా అని చర్చించుకుంటున్నారు.

- అక్షరటుడే, ఆర్మూర్

శ్రీరామ్‌సాగర్ వెలవెల

■ వేగంగా పడిపోతున్న నీటిమట్టం ■ తాగునీటికే ప్రభుత్వం ప్రాధాన్యం
■ ఆయకట్టు రైతుల్లో ఆందోళన.. ■ యాసంగి సాగు కష్టమే..

ఎస్సారెస్పీ పూర్తి సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 36 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ 7 టీఎంసీలు పోతే వాడుకోదగ్గది 29 టీఎంసీలే మాత్రమే. ఈ ఏడాది రాష్ట్రంలో 36 రిజర్వాయర్లలో నీరు ప్రమాదకర స్థాయికి పడిపోయింది. అందులో గోదావరి బేసిన్‌లో ఎస్సారెస్పీ (48.58 టీఎంసీల నుండి 36 టీఎంసీలకు), ఎల్లంపల్లిలో 18.17 టీఎంసీలు, మిడ్ మానేరులో 23.42, లోయర్ మానేరులో 15.42 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. దీంతో ప్రభుత్వం ఆయకట్టుకు నీరు నిలిపివేసి, తాగునీటికే రిజర్వ్ చేయాలని నిర్ణయించింది. ఆయకట్టును కాపాడేందుకు అక్టోబర్ 10 నుండి 20 వరకు 9 టీఎంసీలను కాకతీయ (LMC), సరస్వతి, లక్ష్మీ, వరద కాలువలు, అలీసాగర్/గుప్తా లిఫ్టుల ద్వారా ఒక్క తడికి విడుదల చేశారు. కానీ ఆ నీరు చివరి ఆయకట్టు అయిన బాల్కొండ, ఆర్మూర్, జక్రాన్ పల్లి వరకు చేరనే లేదు.

రైతుల్లో పెరుగుతున్న ఆందోళన

లెక్కల్లో 36 టీఎంసీలు అంటే అధికారులకు ఒక సంఖ్య. కానీ ఇక్కడి రైతుకు అది ఆర్నెళ్ల శ్రమ. నవంబర్‌లో కోతకు రావాల్సిన వరి ఇప్పుడు పాలు పోసుకుంతోంది. ఈ సమయంలో ఒక్క తడి ఇవ్వకపోతే గింజ తాలు అవుతుంది. ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడి పెట్టిన రైతులు ఇప్పుడు అప్పులెలా తీర్చాలి అని బెంగ పెట్టుకుంటున్నాడు.

నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో..

నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని 6లక్షల ఎకరాల ఆయకట్టు ఇప్పుడు ప్రమాదంలో పడింది. కాలువ చివరి రైతులకు నీరు చేరకపోవడంతో, వారు రాత్రిళ్లు కాలువ గట్ల వద్దే కాపలా కాస్తున్నారు. బోర్లలో నీరు అడుగంటడంతో వ్యవసాయ మోటార్ల వినియోగం పెరిగి, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరి ధాన్యాగారంగా ఉన్న ఈ ప్రాంతం, ఇప్పుడు ప్రతి ఏటా 'నీరు వస్తుందా.. రాదా?' అనే బెంగతోనే పంటలు వేస్తున్నారు. ఎగువన మహారాష్ట్రలో బాబ్లీ, ఇతర ప్రాజెక్టులతో నీటిని ఆపేయడం, దిగువన పూడికతో సామర్థ్యం తగ్గడం, తోడు ఎల్‌నినోతో వర్షాభావం.. మూడు కలిసి శ్రీరాంసాగర్‌కు జలాలు రాకుండా అడ్డుకుంటున్నాయి.

శ్రీరాంసాగర్ చరిత్రలో సంక్షోభాలు..

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుకు 1972-73లో తొలి పెద్ద కరువు వచ్చింది. 1987లో చరిత్రలోనే అత్యంత దారుణం పరిస్థితి ఏర్పడింది. దేశవ్యాప్తంగా అతి పెద్ద కరువు ఏర్పడింది. ఎస్సారెస్పీ నీటిమట్టం 1,011 అడుగులకు పడిపోయింది. ఇది చరిత్రలోనే అత్యల్పమైన నీటిమట్టంగా నిలిచింది. రిజర్వాయర్ అడుగున పాత గ్రామాల శిథిలాలు, గుడి గోపురాలు బయటపడ్డాయి. నిల్వ 3 టీఎంసీల కంటే తక్కువ. 1992-93, 1999-2004లలోనూ వరుస కరువులు ప్రాజెక్టును..దాని కింద ఆయకట్టును అతలాకుతలం చేశాయి. ఈ పన్నెండేళ్లలో ఆరుసార్లు ప్రాజెక్టు 50శాతం కూడా నిండలేదు. 2000-2004 మధ్య వరుసగా నాలుగేళ్లు సగటు ఇన్‌ఫ్లో 30 టీఎంసీలు మాత్రమే ఉంది.

తెయూలో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి



అక్షరటుడే, తెయూ క్యాంపస్: తెలంగాణ యూనివర్సిటీలో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని చీఫ్ వార్డెన్ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు వర్సిటీలోని వార్డెన్లు, కేర్‌టేకర్లు, వివిధ హాస్టళ్ల మెస్ కమిటీ సభ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీలోని బాలుర, బాలికల వసతిగృహాల నిర్వహణ, విద్యుత్, నీటి పొదుపు చర్యలు, బియ్యం సరఫరా ధరల పెరుగుదల తదితర అంశాలపై రవీందర్‌రెడ్డి సమీక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల విద్యుత్ వినియోగానికి సంబంధించి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భవిష్యత్తులో యూనివర్సిటీలో విద్యుత్ సరఫరా పరంగా ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అవసరమైన సమయాల్లో మాత్రమే విద్యుత్ వినియోగిస్తూ.. అనవసరంగా లైట్లు, ఫ్యాన్లు ఇతర విద్యుత్ పరికరాలను ఆన్‌లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో వార్డెన్లు డా.గంగాకిషన్, డా.కిరణ్ రాథోడ్, డా.జ్యోత్స్న, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైద్య కళాశాల పారామెడికల్ కోర్సులో 60 సీట్లు

అక్షరటుడే, కామారెడ్డి: ప్రభుత్వ వైద్య కళాశాల కామారెడ్డిలో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ వాల్యా ఒక ప్రకటన విడుదల చేశారు. మెడికల్ కళాశాలలో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ లో 30 సీట్లు, డిప్లొమా ఇన్ ఎకో కార్డియోగ్రఫీలో 30 సీట్లు ఉన్నట్టు తెలిపారు. ఈనెల 24 నుండి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు పూర్తి చేసిన తర్వాత జిరాక్స్ కాపీ, దరఖాస్తు ఫారం, అవసరమైన ధ్రువపత్రాల ప్రతులను మెడికల్ కళాశాల కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇతర వివరాల కోసం తెలంగాణ పారామెడికల్ బోర్డు అధికారిక వెబ్ సైట్ http://www.tgpmb.telangana.gov.in ను సందర్శించాలన్నారు.

వ్యవసాయ భూమిలో ఫామ్‌పాండ్ నిర్మించాలి

అక్షరటుడే, కామారెడ్డి : ప్రతి రైతు తమ వ్యవసాయ భూమిలో ఫామ్‌పాండ్ నిర్మించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో వీబీజీ రాంజీ పథకం కింద కొనసాగుతున్న ఫామ్‌పాండ్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో వ్యవసాయ క్షేత్ర చెరువు నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాల పెరుగుదలకు, పంటలకు అవసరమైన సాగునీటి లభ్యతకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామానికి చెందిన రైతు సింగిని భిక్షపతి తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో ఫామ్‌పాండ్ నిర్మాణం చేపట్టడాన్ని కలెక్టర్ అభినందించారు. పనుల పురోగతి, కల్పించిన పని దినాలు, పనులు ప్రారంభించిన తేదీ, కూలీల వేతనాల చెల్లింపుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌తో పాటు గ్రామంలోని ఇతర రైతులు కూడా తమ వ్యవసాయ భూముల్లో ఫామ్‌పాండ్‌ల నిర్మాణానికి ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్‌వై గిరి, డీఆర్డీఏ పీడీ దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, ఎంపీడీఓ సవిత రెడ్డి, ఏడీఏ అపర్ణ, సర్పంచ్ సాయాగౌడ్, సహకార సంఘం చైర్మన్ రాజాగౌడ్, మండల అధికారులు పాల్గొన్నారు.



మోదీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది : బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్



అక్షరటుడే, ఆర్మూర్: మోదీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందని దానిని చూడలేకే విదేశీ శక్తులు ఆయనపై కుయుక్తులు పన్నుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. ఆర్మూర్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు అధ్యక్షతన శనివారం పట్టణ కార్యవర్గ సమావేశాన్ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దినేష్ మాట్లాడుతూ.. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రధాని చేస్తున్న అభివృద్ధిని చాయ్‌పే చర్చ, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ల ద్వారా ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంచెట్టి గంగాధర్, రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి కలిగొట గంగాధర్, రాష్ట్ర ఓబీసీ మోర్చ అధికార ప్రతినిధి వంగ వివేకానంద్,రాష్ట్ర రెడ్‌క్రాస్ కౌన్సిల్ మెంబర్ అనిల్, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి దశరథ్,జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు తిరుపతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోల్కం వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం లోటు ఏర్పడి కరువు పరిస్థితులు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీకి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చైర్మన్‌గా వ్యవహరించనుండగా, జిల్లా వ్యవసాయ అధికారిని మెంబర్ కన్వీనర్‌గా, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, నీటిపారుదల శాఖ జిల్లా అధికారి, మిషన్ భగీరథ సూపరింటెండింగ్ ఇంజినీర్, ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు కమిటీ సభ్యులుగా ఉన్నారు. కరువు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించడంపై ఈ కమిటీ దృష్టిసారిస్తుందన్నారు. వర్షపాతం లోటు, భూగర్భ జలాల స్థితిగతులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలను ప్రతివారం సమీక్షించడం చేస్తారన్నారు. ప్రభావిత గ్రామాలను సందర్శించి పరిస్థితులను అంచనా వేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం, సంబంధిత శాఖల ద్వారా కరువు నివారణ చర్యల అమలును పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో ఏవీ ఎంటర్ ప్రైజెస్ సెంటర్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో శనివారం అసిస్టెంట్ సైంటిస్ట్ (ప్రొల్యూషన్ కంట్రోల్ బోర్డు) పోస్టుల భర్తీ కోసం సీబీటీ విధానంలో ఎగ్జామ్ నిర్వహించగా పరీక్ష కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరుతెన్నులను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా లేదా అనేది గమనించారు. బయోమెట్రిక్ హాజరు సేకరణలో ఏమైనా ఇబ్బందులు తలెత్తాయా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలోని ఆయా గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తూచా తప్పకుండా అమలు చేస్తూ, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్ష జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పరీక్ష సమయం ముగిసేంత వరకు ఎవరు కూడా బయటకు వెళ్లకుండా చూడాలని అన్నారు. ఈనెల 26న జరగనున్న పరీక్షలను కూడా కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఐఈవో రవికుమార్ తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



అక్షరటుడే, కామారెడ్డి : నెలరోజుల క్రితం కామారెడ్డి పట్టణంలో కిడ్నాప్‌నకు గురైన బాలుడిని ఎట్టకేలకు పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు పట్టణ సీఐ నరహరి మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆదిత్య అనే వ్యక్తి తన నాలుగేళ్ల కుమారుడు ధనుష్ కిడ్నాప్‌నకు గురయ్యాడని ఈనెల 17 న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని నాలుగు ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టగా రామారెడ్డి మండలం ఉప్పలవాయి గ్రామంలో బాలుడి ఆచూకీ కనుగొన్నట్టు తెలిపారు. బాలుడిని కిడ్నాప్ చేసిన ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్టు పేర్కొన్నారు. కాగా బాలుడి కిడ్నాప్ ఉదంతాన్ని 'అక్షరటుడే' శుక్రవారం వెలుగులోకి తీసుకువచ్చింది. రామారెడ్డి మండలంలోని ఓ గ్రామంలో బాలుడిని నెల రోజులుగా బంధించిన విషయాన్ని ప్రస్తావించగా ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ కేసులో బాలుడు గత నెలలో కిడ్నాప్ అయితే నెలరోజుల తర్వాత బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు ఎందుకు చేశారన్నది తెలియాల్సి ఉంది.

వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు చేయాలి



అక్షరటుడే,పెద్దకొడప్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వరంగల్ రైతు డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర భారతీయ కిసాన్ సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఈనెల 26న 'చలో తహశీల్దార్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దకొడప్‌గల్ గ్రామ అధ్యక్షుడు కుమార్‌సింగ్ కోరారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయం, వ్యవసాయ కూలీలకు రూ.12వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. పంటలకు మద్దతు ధరతోపాటు వరికి రూ.500 బోనస్ ఇవ్వాలని, పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్ రద్దు, నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు, మూతపడిన చక్కెర కర్మాగారాల పునఃప్రారంభం, పసుపు బోర్డు ఏర్పాటు చేపట్టాలని డిమాండ్ చేశారు. 'చలో తహశీల్దార్ కార్యక్రమానికి మండలంలోని రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో హాజరై తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేయాలని కుమార్ సింగ్ విజ్ఞప్తి చేశారు.



వెన్ను విరుస్తున్న స్పీడ్‌బ్రేకర్లు

- నగరంలో ఇష్టారీతిన ఏర్పాటు
- అవస్థలు పడుతున్న ద్విచక్రవాహనదారులు
- పట్టించుకోని మున్సిపల్ కార్పొరేషన్

జిల్లా కేంద్రంలో రహదారులపై ఇష్టారీతిన ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు వాహనదారుల వెన్ను విరుస్తున్నాయి. నిబంధనలు పాటించకుండా ఎక్కడ పడితే అక్కడ వీటిని నిర్మించడంతో ఆ రోడ్లపై వెళ్లాలంటేనే వాహనదారులకు వెన్నులో వణుకు పుడుతుంది.

– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ

మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన బీటీ, సీసీ రోడ్లపై ఎక్కడ చూసినా.. స్పీడ్ బ్రేకర్లు ఉండడంతో వాహనదారుల ప్రయాణం సాఫీగా సాగట్లేదు. ప్రమాదాలు జరిగేచోట..పాఠశాలలు ఉన్న ప్రదేశాల్లో రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు పెడితే మంచిదే కాని నిబంధనలు విస్మరించి ఎక్కడపడితే అక్కడ వీటిని ఏర్పాటు చేయడంతో నిత్యం తప్పని పరిస్థితుల్లో ఆయా రోడ్లపై వెళ్లేవారికి చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ రోడ్లపై వెళ్లిన వారికి వెన్నునొప్పులు వేధిస్తున్నాయి.

నగరంలో ఈ ప్రాంతాల్లో..

నగరంలో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. గోల్‌హన్మాన్ నుంచి పూలాంగ్‌కు వెళ్లేదారిలో దాదాపు ఏడెనిమిది స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. అవి కూడా దగ్గరదగ్గరగా ఉండడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే విశ్వశాంతి కళాశాల నుంచి మాజీ మేయర్ స్ట్రీట్‌కు వెళ్లేదారిలో సైతం 11వరకు స్పీడ్ బ్రేకర్లు ఉంటాయి. పాఠశాలలు ఉన్నచోట్ల వీటిని ఏర్పాటు చేయడం మంచిదేకాని.. ఎక్కడపడితే అక్కడ వీటిని నర్మించడంతో ఒక్కోసారి చూసుకోక వాటిపైకి ఎక్కి వెన్నునొప్పులు తెచ్చుకోవాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.


ప్రయాణానికి అడ్డంకులు..

పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులన్న చోట, వాహనాల రద్దీ, జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాలు, ప్రమాదకరమైన మూల మలుపుల వద్ద మాత్రమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. పోలీసు, ట్రాఫిక్ అధికారుల నివేదిక, ఇంజినీర్ అనుమతి ఉంటేనే గుత్తేదారు ఆయా రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. కానీ చాలాచోట్ల వార్డుల్లో అనుమతి లేకుండానే నిర్మించారు. స్థానికుల ఒత్తిడి, కార్పొరేటర్ల సూచనతో అవసరం లేకపోయినా నిర్మించారు. కొందరు వ్యాపారులు సైతం తమ షాపుల ముందున్న రోడ్లపై స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేసి అడ్డంకులు సృష్టిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ) మార్గదర్శకాల ప్రకారం.. స్పీడ్ బ్రేకర్ కనీసం 3మీటర్ల వెడల్పులో, 10 సెంటీమీటర్ల ఎత్తులో నిర్మించాలి. స్పీడ్ బ్రేకర్‌పై వాహనం ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు కుదుపునకు లోనుకాకుండా అవసరమైన వంపును ఏర్పాటు చేయాలి.. ఈ నిబంధనలు ఎక్కడా పాటించట్లేదని తెలుస్తోంది. కొన్నిచోట్ల ఎక్కువ ఎత్తులో నిర్మించడంతో వాహనాల కిందిభాగాలు వాటికి తగులుతున్నాయని.. తద్వారా బైక్‌లు పాడవుతున్నాయని సైతం పలువురు వాపోతున్నారు.

వేంపల్లిలో ఉచిత వైద్యశిబిరం



అక్షరటుడే, ముప్కాల్: ముప్కాల్‌లోని ఏజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉదయం వేంపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆస్పత్రి వైద్యురాలు అపర్ణ గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స అందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ యాదవ్, ఉపసర్పంచ్ సునీత, ఏజీ ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుడి కుటుంబానికి అధికారుల పరామర్శ



అక్షరటుడే, మెండోరా: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెండోరా మండలం చాకిర్యాల్ గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ నర్సయ్య కుటుంబాన్ని సీఐ జాన్ రెడ్డి, ఎస్సై సుహాసిని, పోలీస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నర్సయ్య కుటుంబానికి పోలీస్ శాఖ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని సీఐ జాన్ రెడ్డి తెలిపారు. విధి నిర్వహణలో పోలీస్ అమరవీరులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు.

పదోతరగతి బాలికలకు ఇస్రో టూర్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

అక్షరటుడే, కామారెడ్డి: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న బాలికలకు ఇస్రో ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్ ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలో మెరిట్‌లో ఉన్న 50మంది బాలికలను ఇస్రో శ్రీహరికోట టూర్‌కు తీసుకెళ్లనున్నారని మల్లికార్జున్ తెలిపారు. ఆన్‌లైన్ పరీక్ష ఈనెల 31న నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలో పాల్గొనే విద్యార్థినులు గూగుల్ ఫామ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా వేదిక విద్యార్థుల నమోదు ఆధారంగా డివిజన్లలో లేదా జిల్లాలో నిర్వహించాలనేది నిర్ణయించనున్నారని పేర్కొన్నారు. పరీక్ష సిలబస్‌లో గణితం 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు, భౌతికశాస్త్రం 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు, అంతరిక్ష శాస్త్రం ఉంటుందన్నారు. అంతరిక్ష శాస్త్రంలో భారతదేశం అంతరిక్ష శాస్త్రానికి చేసిన కృషి, అంతర్జాతీయ అంతరిక్ష సంస్థలు, సౌర వ్యవస్థ, గ్రహాలు, గెలాక్సీలు విశ్వం, రాకెట్లు, ఉపగ్రహాలు, అంతరిక్ష సాంకేతికత, అంతరిక్ష మిషన్లు, వ్యోమగాములు, శాస్త్రవేత్తలు, అంతరిక్ష అన్వేషణ, భవిష్యత్ అంతరిక్ష అన్వేషణ అంశాలు ఉంటాయన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి సిద్దరాంరెడ్డిని 9697982888 ద్వారా సంప్రదించాలని సూచించారు.

పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం

అక్షరటుడే, కామారెడ్డి: శాంతిభద్రతల కోసం ప్రాణాలు త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో జరిగిన ఈ శిబిరానికి పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు, యువత, ఆటో డ్రైవర్లు, వివిధ సంఘాల సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొత్తం 435 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అమరుల స్ఫూర్తితో రక్తదానం చేయడం గొప్ప మానవీయ సేవ అని తెలిపారు. రక్తదానం చేయండి, ప్రాణదాతలుగా నిలవండని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన వారికి జిల్లా పోలీసు శాఖ, తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, రెడ్ క్రాస్ ఛైర్మన్ సంజీవ రెడ్డి, తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతిపై ఇద్దరు మైనర్ల దాడి.. పోలీసులకు అప్పగింత

అక్షరటుడే, బాన్సువాడ: యువతిపై ఇద్దరు మైనర్లు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన బాన్సువాడ పట్టణంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నివాసం ఉంటున్న ఇద్దరు మైనర్ బాలురు మద్యం సేవించి వస్తూ.. అదే ప్రాంతానికి వెళ్తున్న ఓ యువతిని వెనుక నుంచి అడ్డుకున్నారు. ఒకరు యువతి ముఖాన్ని చేతులతో పట్టుకోగా, మరొకరు ఆమెపై దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో భయాందోళనకు గురైన యువతి కేకలు వేయడంతో అప్రమత్తమైన స్థానికులు అక్కడికి చేరుకుని ఇద్దరు బాలురను పట్టుకున్నారు. వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. యువతిపై దాడికి గల కారణాలు, ఘటన వెనుక ఇతర ఉద్దేశాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

పోస్ట్ కార్డుల ద్వారా సీఎం, గవర్నర్లకు ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల లేఖలు

అక్షరటుడే, కామారెడ్డి: ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 12వ రోజుకు చేరింది. శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో ఉద్యోగులంతా తమ సమస్యలను విన్నవిస్తూ సీఎం, గవర్నర్లకు పోస్ట్ కార్డుల ద్వారా లెటర్లు రాసి తమ నిరసన వ్యక్తం చేశారు. తమ విధులకు ఉద్యోగ భద్రత కావాలని, క్రమబద్ధీకరణ తదితర అంశాలపై విన్నవిస్తూ పోస్ట్ కార్డులు రాశారు. సమ్మెకు టీఎన్జీవోస్, కామారెడ్డి ఉద్యమ జేఏసీ నాయకులు సందర్శించి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. టీఎన్జీవోస్ జిల్లా సెక్రెటరీ నాగరాజు మాట్లాడుతూ.. ఉద్యోగులు తలుచుకుంటే సాధించనిది ఏదీ లేదని, పోరాటం ద్వారా అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని, ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా చేసే ఉద్యమం కొనసాగించాలన్నారు. కామారెడ్డి జేఏసీ నాయకులు జగన్నాథం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందన్నారు. ఈ ధర్నాలో బహుజనుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు క్యాతం సిద్ధిరాములు, టీఎన్జీవోస్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ చక్రధర్, నాయకులు దేవరాజు, శివకుమార్, సంతోష్, కిషన్, సుమన్, జాక్ నాయకుడు వెంకటరమణ, ఎన్ హెచ్ ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు సుమన్, నాయకులు అశ్విని, వెంకటరమణ, రాజు, బాలు, సాగర్, స్వాతి, సిద్దు పాల్గొన్నారు.





జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ క్రీడాకారిణుల ఎంపిక

అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా జూనియర్ హ్యాండ్‌బాల్ బాలికల జట్టు ఎంపికలను నిర్వహించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. 50 మంది క్రీడాకారులు పాల్గొనగా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు గంగామోహన్ చక్రు ప్రధాన కార్యదర్శి తుమ్మల విద్యాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో సెలెక్షన్లు జరిగాయి. ఎంపికైన క్రీడాకారులను ఈనెల 31వ తేదీ నుండి నవంబర్ 2 వరకు ఖమ్మం జిల్లా సర్దార్ పటేల్ గ్రౌండ్స్‌లో జరిగే 48వ తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల క్రీడాపోటీలకుపంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ఛైర్మన్ అల్జాపూర్ దేవేందర్, నిజామాబాద్ హ్యాండ్ బాల్ సంఘం కోశాధికారి గట్టడి రాజేష్, ఉపాధ్యక్షుడు కాశిరెడ్డి సునీత, నిజామాబాద్ హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి రమణమూర్తి, బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, హ్యాండ్ బాల్ సంఘం సంయుక్త కార్యదర్శి సతీష్ రెడ్డి, నాగరాజు తదితరులున్నారు.

వృద్ధురాలి ఇంట్లో చోరీ.. ముగ్గురు అరెస్ట్

అక్షరటుడే, కామారెడ్డి: తాళం వేసి ఉన్న ఓ వృద్ధురాలి ఇంట్లో చోరీకి పాల్పడిన ముగ్గురిని బిచ్కుంద పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై రాజు వివరాలు వెల్లడించారు. బిచ్కుందకు చెందిన సుంకరి సాయవ్వ ఈ నెల 14న బంధువుల ఇంట్లో కార్యక్రమానికి వెళ్లారు.ఈనెల 18వ తేదీ అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో దొంగలు ఆమె ఇంట్లోకి ప్రవేశించారు. పెట్టెలో దాచిన రూ.15 వేల నగదును అపహరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం బిచ్కుంద పోలీసులు రాజూళ్ల చౌరస్తా, పరమేశ్వర థియేటర్ సమీపంలో గస్తీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది.

